ఎన్నికల ఆఫీసర్ల నియామకం

- వివిధ రాజకీయ పార్టీల నేతలతో సమావేశం
- ముషీరాబాద్ అసెంబ్లీ రిటర్నింగ్ ఆఫీసర్‌గా లక్ష్మీనారాయణ
- నోడల్ ఆఫీసర్‌గా చిక్కడపల్లి ఏసీపీ యాదగిరి


అధికారులతో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు

ముషీరాబాద్: నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా వి.లక్ష్మీనారాయణ నియమితులయ్యారు. గతంలో ఆయన పెద్దపల్లి జిల్లా జాయింట్ కలెక్టర్‌గా పనిచేసి ప్రస్తుతం జీహెచ్‌ఎంసీలో భూసేకరణ విభాగంలో ఆఫీసర్‌గా పనిచేస్తున్నారు. ఇక నోడల్ ఆఫీసర్‌గా చిక్కడపల్లి ఏసీపీ ఏ.యాదగిరి, అసిస్టెంట్ రిటర్నింగ్ ఆఫీసర్లుగా జీహెచ్‌ఎంసీ సర్కిల్–15 డీఎంసీ తిప్పర్తి యాదయ్య, ముషీరాబాద్ తహసీల్దార్‌లు నియమితులయ్యారు. వీరు మంగళవారం వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో జీహెచ్‌ఎంసీ సర్కిల్–15 కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి బీఆర్ఎస్ నుంచి కొండపల్లి మాధవ్, ఎర్రం శ్రీనివాస్‌గుప్తా, మహమూద్ అలీ, కాంగ్రెస్ పార్టీ నుంచి మాజీ కార్పొరేటర్ వాజీద్ హుస్సేన్, తిరుమల్, టీడీపీ నుంచి బాలరాజ్‌గౌడ్, బీజేపీ, బీఎస్పీ, సీపీఐ, సీపీఎం, ఆమ్‌ఆద్మీ పార్టీల నుంచి కూడా ప్రతినిధులు హాజరయ్యారు.

- నవంబర్ 3వ తేదీన ఎన్నికల నోటిఫికేషన్ జారీ చేసినప్పటి నుంచి ముషీరాబాద్ తహసీల్దార్ కార్యాలయాన్ని ఎన్నికల రిటర్నింగ్ ఆఫీస్‌గా పరిగణించబడుతుందన్నారు.
- నవంబర్ 3వ తేదీ నుంచి 10వ తేదీ వరకు వేసే నామినేషన్లను ముషీరాబాద్ తహసీల్దార్ కార్యాలయంలోనే స్వీకరించబడతాయని, 3వ తేదీ వరకు కొత్తగా ఓటరు నమోదు చేసుకోవచ్చని వివరించారు.
- వాల్ రైటింగ్, బ్యానర్లు, పోస్టర్లను బహిరంగ ప్రదేశాలు, ప్రభుత్వ ఆస్తులపై వేయాలంటే తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలని, ప్రైవేటు ఇళ్లపై ఏమైనా బోర్డులు పెట్టాలన్న అనుమతి తీసుకోవాలని కోరారు.
- వివిధ రాజకీయ పార్టీలు తమ ప్రచారం కోసం చేసే పాదయాత్రలు, సభలు, సమావేశాల కోసం సువిధ పోర్టల్‌లో 48 గంటల ముందు అప్‌లోడ్ చేసి అనుమతి తీసుకోవాలని కోరారు.
- సెప్టెంబర్ 19వ తేదీ నాటికి దరఖాస్తు చేసుకున్న వారికి అక్టోబర్ 4వ తేదీన ఓటరులిస్టులో పేర్లు నమోదయ్యాయని దాని ప్రకారం పురుషులు 1,51,494 మంది, మహిళా ఓటర్లు 1,42,641 మంది, ట్రాన్స్‌జెండర్లు 12 మందితో కలిసి మొత్తం ఓటర్ల సంఖ్య 2,94,147 మంది ఉన్నారన్నారు.
- సెప్టెంబర్ 20 నుంచి అక్టోబర్ 10వ తేదీ వరకు ఈ 20 రోజుల్లో అదనంగా 2,749 మంది ఓటరు లిస్టులో పేరు కోసం దరఖాస్తు చేసుకున్నారని ఈ అవకాశం నవంబర్ 3వ తేదీ వరకు ఉందని వీరందరిని కలిపి అడిషనల్ లిస్టులో ప్రకటిస్తామన్నారు.
- కొత్తగా ఈ ఎన్నికల్లో వికలాంగులకు, 80 ఏళ్ల పైబడిన వారికి ఇంటి నుంచే ఓటువేసే అవకాశాన్ని ఎన్నికల సంఘం కల్పించిందని దీని కోసం మూడు రోజుల ముందు 12డీ ఫామ్‌ను ఇస్తే వారి ఇంటికెళ్లి ఓట్లు వేసుకునే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు.
- రాంనగర్‌లోని మదర్స్‌స్కూల్‌లో ఆరు పోలింగ్ స్టేషన్‌లు ఉండటం వల్ల ఓటర్లకు అసౌకర్యం కలిగే అవకాశం ఉందని భావించి 234 పోలింగ్ బూత్‌ను పక్కనే ఉన్న జే.వీ.హైస్కూల్‌కు, 239 పోలింగ్‌బూత్‌ను డిస్నీకిడ్స్ స్కూల్‌కు మార్చేలా రిటర్నింగ్ అధికారి ప్రతిపాదనలు చేశారు.

రిటైర్డు ఉద్యోగులకు ఒకే పెన్షన్ విధానాన్ని వర్తింపజేయాలి


పెన్షనర్స్ ఉద్యోగ సంఘాల సమావేశంలో మాట్లాడుతున్న శ్రీకాంత్‌మిశ్రా

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంస్థల్లో పనిచేసి పదవీవిరమణ పొందిన ఉద్యోగులందరికీ ఒకే పెన్షన్ విధానాన్ని వర్తింపజేయాలని ఆల్ ఇండియా ఇన్సురెన్స్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ మిశ్రా డిమాండ్ చేశారు. మంగళవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన సదస్సులో ఆయన మాట్లాడుతూ.. యూనివర్సల్ సోషల్ సెక్యూరిటీ కల్పించడంలో భారత్ ప్రపంచంలో 44 దేశాల్లో 42వ స్థానంలో ఉందన్నారు. దేశంలో పని చేస్తున్న సంఘటిత రంగంలోని కార్మికులలో 75 లక్షల మంది నూతన పెన్షన్ విధానంలో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సుమారు 15 ఏళ్ల తరువాత పాత పెన్షన్ విధానంలో ఉండే ఉద్యోగుల సంఖ్య పూర్తిగా తగ్గిపోతుందన్నారు. పీఎఫ్ సౌకర్యం నూతన పెన్షన్ విధానంలోని ఉద్యోగులెవరికీ అందుబాటులో లేదని ఇక గ్రాట్యుటీ కూడా భవిష్యత్తులో కొనసాగే అవకాశం లేదన్నారు. ఆల్ ఇండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయిస్ అసోసియేషన్ నాయకులు కె.వేణుగోపాల్, వివిధ ఇన్సూరెన్స్ సంఘాల నాయకులు పాలకుర్తి కృష్ణమూర్తి, నాగేశ్వర్‌రావు, కె.శంకరనారాయణ, ఎం.వి.హరీష్, విజయ్‌భాస్కర్‌రెడ్డి, బుచ్చిరెడ్డి తదితరులున్నారు.

ఎన్నికల రంగంలోకి అధికార యంత్రాంగం


ఫ్లెక్సీలను తొలగిస్తున్న జీహెచ్‌ఎంసీ సిబ్బంది


వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

అంబర్‌పేట: ఎన్నికల కోడ్ రావడంతో అధికార యంత్రాంగం రంగంలోకి దిగింది. అంబర్‌పేట నియోజకవర్గ వ్యాప్తంగా బ్యానర్లు, ఫ్లెక్సీలను తొలగించారు. బస్సుస్టాప్‌లకు ఉన్న ప్రభుత్వ ప్రకటనలను కూడా తీసివేశారు. ఆయా చౌరస్తాల్లో ఉన్న రాజకీయ నేతల ఫ్లెక్సీలను తొలగించారు.

పోలీస్ విభాగం...

అంబర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో విశాల్ మార్ట్ వద్ద పోలీసులు చెక్‌పోస్టును ఏర్పాటు చేశారు. బర్కత్‌పుర చామన్ వద్ద పోలీసులు తనిఖీల కోసం చెక్‌పోస్టును ఏర్పాటు చేశారు. మంగళవారం జరిపిన తనిఖీల్లో రూ.2.25 లక్షలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: టీఎస్‌ఎస్‌పీడీసీఎల్ 11కేవీ ఆజామాబాద్ డివిజన్ పరిధిలో విద్యుత్ మరమ్మతుల కారణంగా పలు ప్రాంతాల్లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4.30 వరకు విద్యుత్ సరఫరాను నిలిపేస్తున్నట్లు ఏడీఈ ఎం.విజయభాస్కర్ తెలిపారు. గోల్నాక ఫీడర్ పరిధిలో జైస్వాల్‌గార్డెన్, తులసీనగర్, తిరుమలనగర్, మారుతీనగర్, ఛే నెంబర్ ఫీడర్ పరిధిలో గోల్నాక చర్చ్, అశోక్‌నగర్, తిలక్‌నగర్, ఛే నెంబర్ వెజిటబుల్ మార్కెట్ తదితర ప్రాంతాలలో 10 గంటల నుంచి 12.30 గంటల వరకు, తిలక్‌నగర్ ఫీడర్ పరిధిలో తిలక్‌నగర్ క్రాస్ రోడ్, ఛే నెంబర్ క్రాస్ రోడ్, అంబర్‌పేట మెయిన్‌రోడ్డు, సంజీవయ్యనగర్ ఫీడర్ పరిధిలో సంజీవయ్యనగర్, తిలక్‌నగర్, మీసేవా, శివాలయం టెంపుల్ తదితర ప్రాంతాలలో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపేస్తున్నట్లు తెలిపారు.

15 నుంచి దేవీ శరన్నవరాత్రోత్సవాలు


అమ్మవారి దర్శనం

నల్లకుంట: న్యూ నల్లకుంటలోని సీతారామాంజనేయసరస్వతి దేవాలయం (న్యూ రామాలయం)లో ఈనెల 15 నుంచి జ్ఞాన సరస్వతి దేవీ శరన్నవరాత్రోత్సవాలు నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని ఆలయ కార్యనిర్వహణ అధికారి(ఈవో) కె.జయంతి ప్రకటించారు. సరస్వతి అమ్మవారు నిత్యం ఒక అలంకరణలో భక్తులకు దర్శనమిస్తారన్నారు. విజయదశమి రోజున శమీపూజలో కేంద్రమంత్రి జి. కిషన్‌రెడ్డి, ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, స్థానిక కార్పొరేటర్ వై.అమృత హాజరవుతారని వివరించారు.

ఆంజనేయస్వామి ఆలయంలో..

చిక్కడపల్లి: నగరంలో ప్రసిద్ధి చెందిన చిక్కడపల్లి వివేక్‌నగర్‌లో ఈనెల 15 నుంచి 23 వరకు ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్న దేవాలయం కార్యనిర్వహణ అధికారి మాచర్ల దేవనాథం, ఆలయ పునర్నిర్మాణ కమిటీ చైర్మన్ బాసాని పద్మలు తెలిపారు. మంగళవారం దేవాలయంలో వారు మాట్లాడుతూ... భువనేశ్వరీదేవి (పార్వతీదేవి) అమ్మవారికి ప్రతి ఏటా నవరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్నామని ఈసారి కూడా ఘనంగా నిర్వహిస్తామని, భక్తులు అధిక సంఖ్యలో హాజరై అమ్మవారిని దర్శించుకోవాలని కోరారు.

ఎమ్మెల్యే ఆర్థికసాయం

అంబర్‌పేట: గుండెపోటుతో ఆకస్మికంగా మృతిచెందిన జర్నలిస్టు దత్తాత్రి కుటుంబానికి ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ చేయూతనిచ్చారు. మంగళవారం ఆయన నివాసంలో కలిసిన దత్తాత్రి కుమార్తెకు రూ.50 వేలు నగదును అందజేశారు. దత్తాత్రితో తనకు ఎంతో అనుబంధం ఉండేదని ఎమ్మెల్యే ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు.

బీసీ ముఖ్యమంత్రిని ప్రకటించాలి

కాచిగూడ: బీసీ ముఖ్యమంత్రిని ప్రకటించాలని తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎర్ర సత్యనారాయణ రాజకీయ పార్టీలను డిమాండ్ చేశారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో 63 శాతం బీసీలకు టికెట్లు కేటాయించాలన్నారు. బీసీల డిమాండ్లను రాజకీయ పార్టీలు మ్యానిఫెస్టోలో పెట్టాలని కోరుతూ ఈ నెల 15న కాచిగూడ మున్నూరుకాపు భవన్, మ్యాడం అంజయ్యహాల్‌లో 'రాష్ట్ర –బీసీ మహాసభ'ను నిర్వహిస్తున్నట్లు ఆయన ప్రకటించారు. జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, వైఎస్‌ఆర్‌సీపీ రాజ్యసభ ఎంపీ ఆర్.కృష్ణయ్య ముఖ్యఅతిథిగా పాల్గొంటారని, బీసీలు అధిక సంఖ్యలో పాల్గొని సంఘటిత శక్తిని చాటాలని ఆయన పిలుపునిచ్చారు. బీసీలను విస్మరిస్తే వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బీసీలు తగిన గుణపాఠం చెబుతారని ఆయన హెచ్చరించారు.

గ్రీన్ ప్లేట్ వాహనాల టాక్స్‌పై పునరాలోచించాలి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ఎలక్ట్రికల్ వాహనాలపై రోడ్డు పన్ను విధించడం పర్యావరణ సానుకూలత విధానానికి ప్రభుత్వం చరమగీతం పాడటమే అవుతుందని తక్షణమే గ్రీన్ వాహనాలకు ఇచ్చే పన్ను మినహాయింపును కొనసాగించాలని ఎన్విరాల్‌మెంట్ ప్రొటెక్షన్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎస్సీ హెచ్ రంగయ్య కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. గ్రీన్ వాహనాల కొనుగోలు దారులకు మరిన్ని రాయితీలు ఇవ్వాలని కోరారు.

ముచ్చర్ల సత్యనారాయణకు ఘన నివాళి


మాట్లాడుతున్న ప్రొఫెసర్ వినాయక్‌రెడ్డి

కాచిగూడ: తెలంగాణ కోసం అంకితభావం, నిబద్ధతతో పోరాటం చేసిన మహనీయుడు ముచ్చర్ల సత్యనారాయణ అని పలువురు వక్తలు కొనియాడారు. తెలంగాణ తొలి ఉద్యమభేరి ముచ్చర్ల సత్యనారాయణ 7వ వర్ధంతి సందర్భంగా మంగళవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో 'తెలంగాణ గతం, వర్తమానం– ముచ్చర్ల పాత్ర' అనే అంశంపై స్మారకోపన్యాసం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డాక్టర్ సంగిరెడ్డి పృథ్వీరాజ్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా కాకతీయ యూనివర్సిటీ పూర్వ ఆచార్యులు ప్రొఫెసర్ ఎ.వినాయక్‌రెడ్డి మాట్లాడుతూ.. నాటకాల ద్వారా ఆదాయాన్ని సమకూర్చి అభివృద్ధి కోసం నిధులను ఉపయోగించిన గొప్ప వ్యక్తి అని కొనియాడారు. సత్యనారాయణ ఆశయాలను నేటి యువతరం ఆదర్శంగా తీసుకుని కొనసాగించాలని పిలుపునిచ్చారు. రిటైర్డ్ ఐఏఎస్ ఆకునూరి మురళి మాట్లాడుతూ.. ముచ్చర్ల స్కూల్ స్థాయిలోనే పాటలు రచించి పాడారని తెలిపారు. సర్పంచ్ స్థాయి నుంచి మంత్రి స్థాయికి ఎదిగారన్నారు. తెలంగాణ ఉద్యమచరిత్రలో అసలైన పోరాట యోధుల పేర్లు గల్లంతు అవుతున్నాయని, తెలంగాణను ద్వేషించినవారే నేడు అధికారంలో ఉన్నారన్నారు. సీనియర్ జర్నలిస్టు పాశం యాదగిరి మాడభూషి శ్రీధర్, విమలక్క, దరువు అంజన్న తదితరులున్నారు.

ఘనంగా సోమన్ జన్మదిన వేడుకలు


ఎమ్మెల్యే ముఠా గోపాల్, ముఠా జైసింహ, సునీల్ తదితరులు

ముషీరాబాద్: ముషీరాబాద్‌కు చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు టి.సోమన్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. మంగళవారం జరిగిన ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఠా గోపాల్, బీఆర్ఎస్ యువజన విభాగం నగర నాయకుడు ముఠా జైసింహ, ఎన్ఆర్ఐ సునీల్‌లు హాజరై శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సేవాభావంతో పనిచేసే సోమన్ పార్టీ అభ్యున్నతికి ఎంతగానో కృషి చేస్తున్నారన్నారు. కరోనా, వరదలు వచ్చిన సందర్భాల్లో పేదలకు, బాధిత కుటుంబాలకు అండగా నిలిచారని పేర్కొన్నారు. ప్రతి కార్యకర్త సేవాభావాన్ని అలవర్చుకుని పార్టీని మరింత బలోపేతం చేసే విధంగా కృషి చేయాలన్నారు. ముషీరాబాద్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్ష, కార్యదర్శులు నర్సింగ్‌ప్రసాద్, ఆకుల అరుణ్‌కుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీధర్ రెడ్డి, ట్రేడ్‌సెల్ అధ్యక్ష, కార్యదర్శులు టెంట్‌హౌజ్ శ్రీనివాస్, డి.శివముదిరాజ్, దీన్‌దయాల్‌రెడ్డి, గౌరీశంకర్ ఆలయ కమిటీ చైర్మన్ శ్రీధర్‌చారి, డివిజన్ ఉపాధ్యక్షులు బల్లా ప్రశాంత్, రాజు, నాయకులు వీరేష్, సాంబశివరావు, రజని తదితరులు పాల్గొన్నారు.

30 నుంచి వైఎంసీఏ కార్గిల్ విక్టరీ స్పోర్ట్స్ ఫెస్టివల్

కాచిగూడ: వైఎంసీఏ గ్రేటర్ హైదరాబాద్ నారాయణగూడ బ్రాంచి ఆధ్వర్యంలో ఈనెల 30, 31వ తేదీల్లో 23వ వార్షిక వైఎంసీఏ కార్గిల్ విక్టరీ స్పోర్ట్స్ ఫెస్టివల్ -2023ను నిర్వహిస్తున్నట్లు వైఎంసీఏ గ్రేటర్ హైదరాబాద్ ప్రధాన కార్యదర్శి ప్రిస్టిలీ గైస్ ప్రకటించారు. హైస్కూల్ స్థాయి విద్యార్థినీవిద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొనవచ్చని ఆయన తెలిపారు. వాలీబాల్, ఖోఖో, కబడ్డీపోటీలు ఉంటాయన్నారు. ఈ పోటీల్లో పాల్గొనే విద్యార్థులు ఈ నెల 27లోగా తమ పేర్లను నమోదు చేసుకోవాలని ఆయన సూచించారు. వివరాలకు 7032660614.

'ముషీరాబాద్ టికెట్ నాదే' !

ముషీరాబాద్: కాంగ్రెస్ తరఫున ముషీరాబాద్ అసెంబ్లీ టికెట్ తనకే వస్తుందని టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్ సంగిశెట్టి జగదీశ్వరరావు ధీమా వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన కార్యాలయంలో మాట్లాడుతూ.. ముషీరాబాద్‌లో పుట్టి పెరిగి స్థానిక సంస్థలపై అవగాహన ఉండి కులాలు, మతాలకు అతీతంగా అందరితో పరిచయాలు ఉండి విద్యావంతుడిగా, పద్మశాలీగా ముస్లిం, మైనార్టీలలో మంచి సంబంధాలు ఉన్నాయన్నారు. ముషీరాబాద్ ఇతర నియోజకవర్గాలతో పోలిస్తే బాగా వెనుకబడి ఉందన్నారు. పేదల బతుకులు మారలేదని నియోజకవర్గంలో చాలా సమస్యలు ఎక్కడికక్కడే ఉన్నాయన్నారు. తనపై నమ్మకంతో పార్టీ అధిష్టానం టికెట్ కేటాయిస్తే గెలిపించి తీరతామన్నారు.

సన్మానం



చిక్కడపల్లి: బీఆర్ఎస్ పార్టీకి అంకితభావంతో పనిచేసేవారిని కాపాడుకోవాలని ఆ పార్టీ యువ నేత ముఠా జైసింహ అన్నారు. గాంధీనగర్ డివిజన్ బీఆర్ఎస్ సీనియర్ నేత సాయికీర్త్(బాబ్జీ)ని మంగళవారం సన్మానించారు. పార్టీ కోసం ఆయన ఎంతో శ్రమించి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులకు అందించడంలో కృషి చేశారన్నారు. పార్టీ నాయకులు సత్యనారాయణ, సాయిచాణిక్యరెడ్డి, హర్షవర్ధన్‌గౌడ్ (టింకు) తదితరులున్నారు.

సంగీత భరితంగా సాలూరి జయంతి


పురస్కార గ్రహీతలతో రమణాచారి

చిక్కడపల్లి: సంగీతంలో నవరసాలు సాలూరి రాజేశ్వర్‌రావు పలికిస్తారని డాక్టర్ కేవీ రమణాచారి అన్నారు. రసమయి సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి త్యాగరాయగానసభలో ప్రఖ్యాత సంగీత దర్శకులు సాలూరి రాజేశ్వర్‌రావు 101వ జయంతి సంగీతభరితంగా సాగింది. ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన సాలూరి సంగీత పురస్కారాలను శారద ఆకునూరి వీపీ లక్ష్మి, అమృతవల్లి, పద్మశ్రీ, వీకే దుర్గ, సురేష్, విజయ్ మండపాక, పవన్‌చరణ్ పక్షాన ఆయన శ్రీమతికి బహూకరించారు. దూరదర్శన్ పూర్వ డైరెక్టర్ డాక్టర్ మధుసూదన్‌రావు, రసమయి అధ్యక్షుడు డాక్టర్ ఎం.కె.రాము, సాలూరి కుమారుడు రామారావు, ఆశాలత పాల్గొన్నారు.

విశ్వవిద్యాలయాల సమస్యలు పరిష్కరించాలి


ప్రొ. ఇటికాల పురుషోత్తం

లాలాపేట: తెలంగాణలోని అన్ని విశ్వవిద్యాలయాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని టీజేఏసీ చైర్మన్ ప్రొ. ఇటికాల పురుషోత్తం డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. .రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాల పరిస్థితి అధ్వానంగా తయారైందని ఉన్నత విద్యను ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేస్తోందని ఆరోపించారు. విశ్వవిద్యాలయాల అధ్యాపకులు తమ సమస్యల పరిష్కారం కోసం ఎన్నో విధాలుగా ప్రభుత్వానికి వివరించినా పట్టించుకోవడం లేదన్నారు. ముఖ్యంగా ప్రభుత్వ ఉద్యోగులకు తమ రిటైర్మెంట్ వయస్సును 58 నుంచి 61కి పెంచి హెల్త్ కార్డులు కూడా ఇచ్చిందని కానీ విశ్వవిద్యాలయాల రిటైర్మెంట్ వయస్సు పెంపు విషయంలో ఎలాంటి నిర్ణయం తీసుకోకపోవడం ఆశ్చర్యానికి గురి చేస్తుందన్నారు. యూనివర్సిటీ అధ్యాపకులు రిటైర్మెంట్ వయస్సు పెంపు, హెల్త్ కార్డులు, యూనివర్సిటీల్లోని ఖాళీగా ఉన్న టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టులను భర్తీ చేయాలన్నారు.

సంక్షేమ పథకాలే గెలుపు బాటలు


మాట్లాడుతున్న అజిత్‌రెడ్డి, హాజరైన నాయకులు

మలక్‌పేట: ప్రభుత్వ అభివృద్ధి సంక్షేమ పథకాలే విజయ పథంలో నడిపిస్తాయని బీఆర్ఎస్ మలక్‌పేట అభ్యర్థి తీగల అజిత్‌రెడ్డి అన్నారు. మూసారంబాగ్‌లో డివిజన్ అధ్యక్షుడు చెల్లూరి రఘునందన్‌రెడ్డి అధ్యక్షతన మంగళవారం నియోజవర్గ ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్టీ నాయకులు, కార్యకర్తల సలహాలు, అభిప్రాయాల మేరకు ముందుకు సాగుతామన్నారు. ప్రతీ ఓటరును కలిసి ప్రభుత్వ పనితీరు, పథకాలను వివరించాలన్నారు. ప్రతిపక్షాల కుట్రను తిప్పికొడుతూ పార్టీ గెలుపు కోసం 50 రోజులు కష్టపడి పని చేయాలని సూచించారు. బీజేపీ, కాంగ్రెస్‌లు ప్రజా విశ్వాసం కోల్పోయారన్నారు. మాజీ కార్పొరేటర్లు సామ ప్రభాకర్ రెడ్డి, తీగల సునరితరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ అనితానాయక్, వైస్ చైర్మన్ కొరుడు భూమేష్, సీనియర్ నేతలు రాజేశ్వర్‌రెడ్డి, బాబుసుదర్శన్, తెళ్ల మహేష్‌కుమార్, బట్టు దాసురావు, నక్క అమరేందర్‌గౌడ్, లాయక్ అలీ, శ్రీనివాస్‌రెడ్డి, అస్లాం ప్రసంగించారు. కార్యక్రమంలో నాయకులు ధర్మేందర్, మోహన్‌రాజ్, సునీత్‌పత్తి, రాధా, కామేష్, నర్సింగ్, టిన్నుసింగ్ పాల్గొన్నారు.

బీసీలకు 50 శాతం సీట్లు కేటాయించాలి

కాచిగూడ: అసెంబ్లీ ఎన్నికల్లో రాజకీయ పార్టీలు బీసీలకు 50 సీట్లు కేటాయించాలని బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు తాటిపాముల వెంకట్రాములు డిమాండ్ చేశారు. మంగళవారం హిమాయత్‌నగర్‌లోని రాజబహదూర్ గౌర్‌హాల్‌లో జరిగిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం చట్టసభలలో బీసీలకు 50 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ చట్టాన్ని ఆమోదించాలన్నారు. మహిళా రిజర్వేషన్‌లో బీసీ మహిళలకు సబ్ కోటా ఏర్పాటు చేయకపోవడం దుర్మార్గమన్నారు. రాజకీయ, ఆర్థికంగా అన్ని రంగాల్లో బీసీలు వెనకబడ్డారన్నారు. ఎల్.శ్రవణ్ కుమార్, బొడ్డుపల్లి కృష్ణ, మేకల శ్రీనివాస్ రావు, దీటి నర్సయ్య, మంగళంపల్లి జనార్దన్, లక్ష్మీనర్సయ్య, మల్లేష్, యాదగిరి, జల్ది రాములు తదితరులు పాల్గొన్నారు.

హోంగార్డు కుటుంబానికి చేయూత

చిక్కడపల్లి: దోమలగూడ పోలీస్ స్టేషన్‌లో పని చేసిన హోంగార్డు గోవింద్ కుటుంబానికి దోమలగూడ పోలీసుల ఆర్థికసాయం అందజేశారు. ఆయన ఇటీవల గుండెపోటుతో మృతిచెందారు. కాగా అతడి మంగళవారం కుటుంబసభ్యులకు నగదును అందజేసినట్లు దోమలగూడ సీఐ దొంతిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. గోవిందు గత నెల 4న పోలీస్‌స్టేషన్‌కు వస్తుండగా మెహదీపట్నం వద్ద హైబీపీతో కిందపడిపోయాడు. స్థానికులు ఆయనను చికిత్స నిమిత్తం సమీపంలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఆయన కుటుంబాన్ని ఆదుకునేందుకు పోలీస్‌స్టేషన్ పక్షాన రూ.50 వేల ఆర్థికసాయం అందజేసినట్లు సీఐ తెలిపారు. దోమలగూడ డీఐ వరప్రసాద్, ఎస్సైలు శ్రీకాంత్‌గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, పోలీసు స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలే మరోసారి గెలిపిస్తాయి !


మాట్లాడుతున్న బీఆర్ఎస్ నగర నాయకుడు బోట్టు శ్రీనివాస్

ముషీరాబాద్: సీఎం కేసీఆర్ రాష్ట్రంలో చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలు బీఆర్ఎస్‌ను మరోసారి గెలిపిస్తాయని బీఆర్ఎస్ నగర నాయకుడు బొట్టు శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం అడిక్‌మెట్‌లో ఆయన మాట్లాడుతూ.. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను వందశాతం అందించిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కిందని అభిప్రాయపడ్డారు. హైదరాబాద్‌ను విశ్వ నగరంగా గుర్తింపు తీసుకొచ్చారని, అర్హులకు ఆసరా, కల్యాణలక్ష్మి, షాదీముబారక్, రైతు, దళిత, బీసీ, ముస్లింబంధు పథకాలు అందించి అందరికీ ఉపాధి కల్పించారన్నారు. ఐటీ రంగం అభివృద్ధికి మంత్రి కేటీఆర్ ఎంతో కృషి చేశారన్నారు. నగరంలో ఫ్లైఓవర్లు, స్కైఓవర్ల నిర్మాణం జరిగిందని, నియోజకవర్గంలో ఎమ్మెల్యే ముఠా గోపాల్ నాయకత్వంలో అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు జరిగాయన్నారు. బీఆర్ఎస్ నాయకులు పరకాల రజనీకాంత్‌గౌడ్, భాస్కర్, రఘు తదితరులున్నారు.

మానసిక ఆనందంతోనే సంపూర్ణ ఆరోగ్యం


వరల్డ్ మెంటల్ హెల్త్‌డే వేడుకల్లో పాల్గొన్న వైద్యులు, విద్యార్థులు

గాంధీఆస్పత్రి : మానసిక ఆనందంతో సంపూర్ణ ఆరోగ్యం సాధ్యపడుతుందని, మానసిక రుగ్మతలు, ఒత్తిడిని జయించి అనుకున్న లక్ష్యాన్ని సాధించుకోవాలని, ఆత్మహత్య సమస్యలకు పరిష్కారం కాదని పలువురు వైద్య నిపుణులు పేర్కొన్నారు. సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రి సైక్రియాట్రి విభాగం ఆధ్వర్యంలో మంగళవారం వరల్డ్ మెంటల్ హెల్త్‌డే అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గాంధీ ఆస్పత్రి, ఎర్రగడ్డ మానసిక వైద్యశాల సూపరింటెండెంట్లు రాజారావు, ఉమాశంకర్ మాట్లాడుతూ... గతేడాది వివిధ కారణాలతో ప్రపంచవ్యాప్తంగా సుమారు 8 లక్షల మంది ఆత్మహత్యలకు పాల్పడినట్లు గణాంకాలు వెల్లడిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఆందోళన, ఒత్తిడి, రుగ్మతలు, నిరాశ, నిస్పృహ, అహంకారం (ఇగో) సమస్యలతో మానసిక వ్యాధులకు గురవుతున్నారని, చిన్నపాటి జ్వరం వస్తే వైద్యుని వద్దకు వెళ్లేవారు, మానసిక రుగ్మతల బారిన పడినప్పటికీ మనోవైద్యులను సంప్రదించేందుకు ముందుకురాకపోవడం దురదృష్టకరమన్నారు. మూఢనమ్మకాలను వీడి ర్యాంకులు, మార్కుల కోసం విద్యార్థులపై ఒత్తిడి చేయవద్దని, వారికి ఏ అంశంపై అభిరుచి ఉందో గుర్తించి తగిన విధంగా ప్రోత్సహించాలని సూచించారు. మానసిక ఆరోగ్యంపై పలు అంశాల్లో పోటీలు నిర్వహించి విజేతలకు ప్రోత్సాహక బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో వివిధ విభాగాల హెచ్‌ఓడీలు శ్రవణ్‌కుమార్, జార్జ్, కృష్ణమోహన్, రవిశేఖర్, షర్మిల, శాంతిశ్రీ, నరేందర్‌కుమార్, మహాలక్ష్మీ, ఆర్‌ఎంఓ-1 జయకృష్ణ, సైక్రియాట్రి వైద్యులు అజయ్‌కుమార్, సురేష్, అనుపమ, కృష్ణచైతన్య పాల్గొన్నారు.

అమరుల స్థూపం నిర్మాణానికి మట్టి సేకరణ

సైదాబాద్: నా మట్టి నా దేశం కార్యక్రమం ద్వారా సేకరించిన మట్టిని దేశ రాజధాని ఢిల్లీలో అమరుల స్థూపం నిర్మాణానికి పంపుతామని బీజేపీ భాగ్యనగర్ జిల్లా అధ్యక్షుడు సంరెడ్డి సురేందర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం మలక్‌పేట నియోజకవర్గం సైదాబాద్ డివిజన్ పరిధిలోని ఆస్మాన్‌ఘడ్‌లో నా మట్టి– నా దేశం ముగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు ఆస్మాన్‌ఘడ్ హనుమాన్ ఆలయం నుంచి రెడ్‌క్రాస్ హాస్పిటల్ వరకు ర్యాలీ నిర్వహించి కాలనీల్లోని ఇంటింటికీ వెళ్లి మట్టిని సేకరించారు. అనంతరం సుందర్‌రెడ్డి మాట్లాడుతూ, 75 సంవత్సరాల ఆజాదీ కా అమృత్ మహోత్సవంలో భాగంగా ప్రజలందరిలో దేశభక్తి పెంపొందించేలా అఖండ భారత్ సంకల్పంతో నిర్వహించిన ఈ కార్యక్రమం ద్వారా సేకరించిన మట్టిని ఒక కలశంలో చేర్చి ఢిల్లీకి పంపుతున్నామన్నారు. కార్యక్రమంలో నగర మాజీ డిప్యూటీ మేయర్ సుభాష్ చందర్జీ, కార్పొరేటర్ కొత్తకాపు అరుణ తదితరులు పాల్గొన్నారు.